క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. సాయినగర్ ఫీడర్ పరిధిలోని నిజాంపేట్, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... అదే విధంగా సాయినగర్, వీఎన్ఆర్ కళాశాల, తెలుగు యూనివర్సిటీ, జీపీఆర్ లేఅవుట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

హన్మకొండ యాత్రలో మేడ్చల్ కాంగ్రెస్ నేతలు



హన్మకొండలో చేపట్టిన పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం హన్మకొండలో జరిగిన 16వ రోజు పాదయాత్రలో మేడ్చల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, కుత్బుల్లాపూర్ నాయకులు జేమ్స్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరీరావు తదితరులు ఆయనతో కలిసి పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'

రంగారెడ్డినగర్: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కుంట అనిల్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అనిల్ నివాసానికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిదులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



అక్కుతి శ్రీనివాసం క్లబ్‌హౌస్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: కంటి వెలుగుతో ప్రజల కంటి సమస్యలు తొలగిపోనున్నాయని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 11వ డివిజన్ పరిధిలోని అక్కుతి శ్రీనివాసం క్లబ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఆమె ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తున్నామని తెలిపారు. ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు సైతం చేయిస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్లు ఆవుల పావని, రాజేశ్వరి, కార్పొరేషన్ బీఆర్ఎస్ బీసీ సెల్ సెక్రటరీ శేషగిరి, 14వ డివిజన్ అధ్యక్షుడు బొబ్బా శ్రీనివాస్‌రావు, మహిళా నాయకురాలు సబిత, వైద్యాధికారులు జ్యోతి రమణి, అభిషేక్, వనకుమారి పాల్గొన్నారు.

కరోనా లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారంకాలనీ యూపీహెచ్‌సీలో 25 మందికి పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

బకాయిలతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజులు తీసుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో పరీక్షల ఫీజులు కళాశాలలోని బకాయిలతో సంబంధం లేకుండా కట్టించుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. మంజూర్ హుస్సేన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ కార్యదర్శి టి. నాగరాజు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్ మాట్లాడారు. స్టూడెంట్స్ రిజిస్ట్రేషన్ ఫీజు పెండింగ్‌లో ఉన్నాయనే నెపంతో ఆయా కళాశాలల విద్యార్థుల పరీక్షల ఫీజులు కట్టించుకోవటం లేదన్నారు. బకాయిల పేరుతో విద్యార్థుల పరీక్ష ఫీజులు తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

ఇద్దరి చూపు అసెంబ్లీపైనే.!





కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్‌లో పెరుగుతున్న పోటీ

నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

అసెంబ్లీ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా మారే అవకాశం కల్పిస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే 2014 (టీడీపీ), 2018లో (టీఆర్ఎస్) జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా వివేకానంద్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈసారి టికెట్ రేసులో తానూ ఉన్నానని ఇప్పటికే తన అనుచరుల ద్వారా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సంకేతాలు పంపడంతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే టికెట్ విషయం ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

కుత్బుల్లాపూర్: ఇప్పటికే సిట్టింగ్ స్థానంలో ఉన్న ఎమ్మెల్యే వివేకానంద అదే పార్టీకి చెందిన వ్యక్తి కావడం ఈ ఇద్దరి మధ్య గత సంవత్సర కాలంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ముచ్చటగా మూడోసారి తనకి టికెట్ వస్తుందనే ధీమాతో ఎమ్మెల్యే వివేకానంద ముందుకు సాగుతుండగా.. కాదు ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజుకు టికెట్ కన్‌ఫర్మ్ అంటూ ఆయన అనుచరులు ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టేశారు.

గ్రౌండ్ వర్క్ పూర్తి చేసుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి 2014, 2018లో రెండు పర్యాయాలు ఉద్యమ నాయకుడిగా ఉన్న శంభీపూర్ రాజు టికెట్ ఆశించి భంగ పడ్డాడు. 2023లో జరిగే ఎన్నికల్లో తనకు తప్పకుండా అసెంబ్లీ టికెట్ కేటాయిస్తారన్న పూర్తి నమ్మకంతో ఇప్పటికే గ్రేటర్ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో గ్రౌండ్ వర్క్ పూర్తి చేసుకున్నారు.

ఎమ్మెల్సీకి మద్దతుగా కార్పొరేటర్లు..

అంతేకాకుండా ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, విజయశేఖర్‌గౌడ్‌లతో పాటు కార్పొరేటర్ల భర్తలు మహమ్మద్ రఫీ, సురేష్‌రెడ్డిలు ఇప్పటికే ఎమ్మెల్సీ రాజుకు పూర్తి మద్దతు పలికి ఆయన వెంట తిరుగుతున్నారు. పైన పేర్కొన్న కార్పొరేటర్లు సైతం సంవత్సర కాలంగా ఎమ్మెల్యేకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

తనకే టికెట్ ఇస్తారన్న నమ్మకంతో ఎమ్మెల్యే!

ఇదే క్రమంలో ఎమ్మెల్యే వివేకానంద సైతం ద్వితీయ శ్రేణి నాయకులతో డివిజన్ అధ్యక్షులను కలుపుకుని ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటూ తనకు అధినేత కేసీఆర్ టికెట్ ఇస్తారన్న పూర్తి నమ్మకంతో ముందుకు సాగుతున్నాడు. ఏది ఏమైనా ఈసారి టికెట్ విషయం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠను రేపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కౌన్సిలర్లకు టచ్‌లో ఉంటూ.. స్థానిక సమస్యలు పరిష్కరిస్తూ..

ఇదే క్రమంలో కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో మెజార్టీ కౌన్సిలర్లకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రతిరోజు టచ్‌లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు.అదే విధంగా నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో సైతం కార్పొరేటర్లుగా కొనసాగుతున్న వారి స్థానిక సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడుతూ వస్తున్నారు.

కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ

అంతేకాకుండా గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంగా కొనసాగుతున్న ఇంటిని సైతం అద్దెకు తీసుకొని ఇక్కడ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించుకున్నట్లు సమాచారం.

గందరగోళంగా కుత్బుల్లాపూర్ ఓటరు లిస్ట్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్ లిస్ట్ గందరగోళంగా మారిందని టీజేఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి అన్నారు. ఓటర్ లిస్టులో పేర్ల గల్లంతైన విషయమై మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ మంగతాయారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఒక బూత్ పరిధిలోని ఓట్లు పక్క బూత్‌లలో... ఒక అపార్ట్‌మెంట్లలో ఉండే వారి ఓట్లు దూర ప్రాంతాల్లోని బూత్‌లకు మారాయని పేర్కొన్నారు. దీంతో తమ ఓటు ఎక్కడుందో తెలియక ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఆధార్‌ను ఓటుతో లింక్ చేస్తున్న నేపథ్యంలో ఇంటి నంబర్లు, బూత్‌ల వారీగా ఓ క్రమ పద్ధతిలో ఓటర్ లిస్ట్ తయారు చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



గుర్రల కృష్ణ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి వాటర్ ట్యాంక్ సమీపంలో నివాసముండే గుర్రల కృష్ణ(50) ఈనెల 20వ తేదీ రాత్రి 7.30 గంటలకు ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. అయితే రాత్రి 9 గంటలైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతడికి ఫోన్ చేస్తే మొబైల్ ఇంట్లో పెట్టి వెళ్లినట్లు గుర్తించారు. కృష్ణ కోసం ఆస్పత్రి చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం అతడి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

35 గుడిసెలు అగ్నికి ఆహుతి



దగ్ధమవుతున్న బాచుపల్లిలోని గుడిసెలు



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన గుడిసెలు

నిజాంపేట్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 35 గుడిసెలు అగ్నికి ఆహుతైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లిలోని షాన్వి అపార్ట్‌మెంట్స్ కన్‌స్ట్రక్షన్ సైట్ సమీపంలో భవన నిర్మాణ కార్మికులు రేకులతో 35 వరకు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం అందుల్లోని ఓ గుడిసెలో షార్ట్‌సర్క్యూట్ తలెత్తడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన కూలీలు గుడిసెల్లోని వస్తు సామగ్రిని బయటకు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో మొత్తం 35 గుడిసెలు కాలిపోయాయని తెలిపారు. రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తా

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో, కమల ప్రసన్న నగర్, వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్‌కాలనీ, మాధవరం నగర్ బీ.సీ బ్లాక్ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలని కాలనీల అసోసియేషన్ సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కాలనీల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. అదే విధంగా కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గోల్ఫ్‌లో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గొలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల, ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు గోల్ఫ్‌లో సత్తా చాటారు. మహారాష్ట్రలోని కోర్గుల్‌లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ గోల్ఫ్ పోటీల్లో 14 మంది క్రీడాకారులు 14 మెడల్స్‌ను సాధించారు. మంగళవారం కళాశాలకు చేరుకున్న క్రీడాకారులను ప్రిన్సిపల్ పాపారావు సన్మానించారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడిపై దాడిని ఖండిస్తున్నాం

కూకట్‌పల్లి: యూత్ కాంగ్రెస్ కార్యకర్త తోట పవన్ పైన జరిగిన దాడిపై తీవ్రంగా ఖండిస్తున్నానని టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల మీద దాడులు చేయటం కుట్రపూరితమన్నారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ గూండాల పాశవిక దాడిలో పవన్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. ప్రశ్నించే వారిపై దాడి చేస్తున్న బీఆర్ఎస్ రౌడీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు వచ్చే ఆదరణను చూసి జీర్ణించుకోలేక ఈ దాడులకు పాల్పడుతున్న విమర్శించారు. ఇప్పటికైనా దాడికి కారకులైనే వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విమర్శలకు ప్రతివిమర్శ చేయాలని కానీ హత్యాయత్నం చేయడం సమ్మతం కాదన్నారు. ప్రతి దాడికి దిగడానికి కాంగ్రెస్‌కు ఒక్క నిమిషం పట్టదని హెచ్చరించారు. పవన్ త్వరగా కోలుకోవాలని ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

హెల్త్ ఆన్ వీల్స్



హెల్త్ ఆన్ వీల్స్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్, రాంకీ ఫౌండేషన మేనేజర్ మహేంద్ర

మొబైల్ హెల్త్ సేవల ప్రారంభం అభినందనీయం

దుండిగల్ తాండ-2లో హెల్త్ ఆన్ వీల్స్ షురూ

దుండిగల్: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డులోని తాండ-2లో కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంకీ ఫౌండేషన్ మేనేజర్ మహేంద్ర మాట్లాడుతూ... ఈ వాహనంలో డయాగ్నోస్టిక్ వసతి, హెల్త్ చెకప్, మెడిసిన్ సప్లయ్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు తిరుగుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామని తెలిపారు.

◆ రీ-సస్టేనబిలిటీ వారి సౌజన్యంతో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ సేవలు ప్రారంభించడం చాలా సంతోషకరమని కౌన్సిలర్ శంకర్ నాయక్ అన్నారు. మున్సిపల్ ప్రజల తరపున రాంకీ సంస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ-సస్టేనబిలిటీ జీఎం సాయి, హెచ్ఆర్ చక్రవర్తి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్‌నాయక్, 27వ వార్డు అధ్యక్షుడు అమర్‌సింగ్‌నాయక్, హనుమంతునాయక్, విజయ్‌నాయక్, కుమార్ నాయక్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

తాండ ప్రైమరీ స్కూల్ సందర్శన

తాండలోని ప్రైమరీ స్కూల్‌ను కౌన్సిలర్ శంకర్‌నాయక్ సందర్శించారు. బడిలోని కిటికీల అద్దాలు పగిలిపోవడాన్ని గుర్తించి వాటి స్థానంలో ఫైబర్ గ్లాసెస్‌ను సొంతంగా పెట్టిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా వేదిక ఏర్పాటు చేసేందుకు మెటీరియల్ ఖర్చులను సైతం భరిస్తానని తెలిపారు. టీచర్స్ కూర్చునే కుర్చీలు, ఫర్నిచర్, స్కూల్ భవనం పై అంతస్తులో పిల్లలకు ఇబ్బంది కలుగకుండా గ్రీల్స్ ఏర్పాటుకు రాంకీ సంస్థ ముందుకొచ్చిందన్నారు. వాటిని త్వరితగతిన ఏర్పాటు చేస్తామన్నారు.

వీడియోగ్రఫీ విభాగంలో కానిస్టేబుల్ అనిల్ ప్రతిభ



కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న డీజీపీ అంజనీకుమార్, సీఐడీ డీజీపీ మహేష్‌భగవత్

కుత్బుల్లాపూర్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన 66వ అఖిల భారత పోలీస్ డ్యూటీమీట్‌లో ప్రతిభ కనబరిచిన వారిని తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ జోన్ ఫింగర్‌ప్రింట్ యూనిట్‌లో పనిచేసే ఏ.అనిల్‌కుమార్ పోలీసు వీడియోగ్రఫీ విభాగంలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో సీఐడీ డీజీపీ మహేష్ భగవత్‌తో కలిసి అంజనీకుమార్ మంగళవారం కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌కు మెమెంటో, సర్టిఫికెట్ అందజేసి శాలువాతో సత్కరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన అనిల్‌కుమార్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం బాలనగర్ డివిజన్ పరిధిలోని ఫింగర్‌ప్రింట్ విభాగంలో పని చేస్తూ తనదైన శైలిలో రాణిస్తున్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ గూండాల దాడులు



షాపూర్‌నగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రంగారెడ్డినగర్: వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పిలుపు మేరకు మంగళవారం షాపూర్‌నగర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ గుండాలు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరోసారి దాడులకు పాల్పడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను బయట తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, సదానందం, యువజన కాంగ్రెస్ నాయకులు మద్దికుంట నవీన్‌రెడ్డి, ఏబీసీ హ్యూమన్ రైట్స్ యువజన అధ్యక్షుడు ఇరుగు రాధాకృష్ణ, ఆర్కల విజయ్ గౌడ్, ఫిషర్మన్ కాంగ్రెస్ కార్యదర్శి పోషి మహేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సూరారం అభివృద్ధికి కృషి చేస్తున్నాం

సుభాష్‌నగర్: డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నానని సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. మంగళవారం హెచ్ఎంటీ సొసైటీలో నూతనంగా చేపట్టిన సీసీరోడ్డు పనలను ఆయన డీఈ శిరీష, సొసైటీ అధ్యక్షుడు నాగిళ్ల శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే డివిజన్‌లో కోట్లాది నిధులు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించామని కార్పొరేటర్ అన్నారు. త్వరలో మిగతా ప్రాంతాల్లో సైతం పూర్తి చేస్తామన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని పేర్కొన్నారు.

మంగళవారం సూరారం డివిజన్ సమైక్య అధ్యక్షులతో కార్పొరేటర్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. బస్తీల్లో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీవో కనకమల్లు, డివిజన్ సమైక్య అధ్యక్షుడు కిషోర్ని, మెహబూబా, బ్రహ్మకుమారి రుతుదేవి తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు మాతృభాష సేవా శిరోమణి అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

నిజాంపేట్: అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ సౌజన్యంతో మంగళవారం విజయవాడలో మాతృభాష సేవా శిరోమణి అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ నాసికా చిత్రకారుడు, నిజాంపేట్‌కు చెందిన సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నిర్వాహకుడు సత్యవోలు రాంబాబుకు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీవీవీఆర్.కృష్ణంరాజు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

ప్రగతి యాత్రలో ఎమ్మెల్యే వివేకానంద్



ఎస్ఆర్‌నాయక్ నగర్‌లో ప్రగతి యాత్ర చేపడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఆయన ప్రగతి యాత్ర చేపట్టారు. రామిరెడ్డినగర్ మీదుగా అపురూపకాలనీ, ఎస్ఆర్ నాయక్‌నగర్, మోడీ బిల్డర్స్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లలోటాయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అదే విధంగా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తానని హామీ ఇస్తూ యాత్రను కొనసాగించారు. ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో రూ.1.52 కోట్ల నిధులతో చేపడుతున్న ఇండోర్ షటిల్ కోర్ట్ పనులు, రామిరెడ్డినగర్‌లో రూ.30 లక్షలతో పూర్తి చేసి సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల అధ్యక్షులు వామన్‌గుప్తా, శ్రీనివాస్ రావు, బాల్‌రాజు, గణేష్, రమణ, తిప్పారెడ్డి, శ్రీనివాస్, శేషాచారి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కన్నారావు, కిషోర్, శర్మ, దుర్గారావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే పూజలు

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయ వార్షిక మహోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు.

దుండిగల్ ఠాణా సిబ్బందికి సత్కారం

దుండిగల్: తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైన దుండిగల్ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని మంగళవారం దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ సత్కరించారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు రావడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, ఇతర పౌర సేవలతో ఇది సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు అర్కల జీతయ్య, వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు మహేందర్‌యాదవ్, సాయియాదవ్, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, అశోక్, కిషన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డిని సత్కరిస్తున్న శంభీపూర్ కృష్ణ